ప్రజాశక్తి

బుధవారం 8 ఫిబ్రవరి 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

మాజీ ఎంఎల్ఎ రావి అరెస్టు

- అర్ధరాత్రి వరకు పలు స్టేషన్లకు తిప్పిన పోలీసులు
- వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు
- కోర్టులో హాజరు, బెయిల్ మంజూరు

పోలీసు స్టేషన్‌లో నేలపై పడుకున్న రావి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక నాగవరప్పాడులోని ఆక్రమణలో ఉన్న ఇళ్ల తొలగింపును అడ్డుకున్న టిడిపి మాజీ ఎంఎల్ఎ రావి వెంకటేశ్వ్రరావును సోమవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు రాత్రంతా అవనిగడ్డ, పామర్రు, జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లు తిప్పుతూ అర్ధరాత్రి 1.30 గంటలకు పమిడిముక్కల పోలీస్ స్టేషన్లో ఉంచి అరెస్టు చూపారు. రావితోపాటుగా మరికొందరు టిడిపి నేతలపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మంగళవారం పమిడిముక్కల స్టేషన్ నుండి గుడివాడ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు రావిని తరలించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి స్థానిక కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆయనకు బెయిల్ మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో గుడివాడలో భారీగా పోలీసులను మొహరించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ పోలీసులు తనకు ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లకు తిప్పారని అన్నారు. పోలీసుల తీరు చాలా దుర్మార్గంగా ఉందన్నారు.

కొడాలి పతనానికి నాంది : మాజీ మంత్రి దేవినేని, కొల్లు

గుడివాడ అంటేనే అసహ్యించుకునేలా మార్చిన కొడాలి నాని... పేద దళితుల ఇళ్లు కుల్చాడంతోనే ఆయన పతనానికి నాంది అవుతుందని మాజీ మంత్రులు, టిడిపి రాష్ట్ర నాయకులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పోలీసులతో కుట్రలు పన్ని రావిపై అక్రమంగా 9 కేసులు పెట్టి అరెస్టు చేసినంత మాత్రాన ఆయనకు ప్రజల నుండి మద్దతు పెరుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మంగళవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని రావి స్వగృహంలో వారు మీడియాతో మాట్లాడుతూ కొడాలి ఒకసారి తన గతాన్ని గుర్తుచేసుకోవాలని, రావి కుటుంబం ముందు చేతులు కట్టుకుని నిలిచిన కొడాలి అక్రమంగా వేలకోట్లు సంపాదించానన్న గర్వంతో విర్రవీగుతున్నారని అన్నారు. కనీసం గుడివాడ - కంకిపాడు రోడ్డును వేయించలేని అసమర్థుడని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నాగవరప్పాడులో టిట్కో గృహాలు కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో రావి వెంకటేశ్వరరావు, టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా, టిడిపి పట్టణ, రూరల్ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, గృహాలు కొలుపోయిన బాధితులు పాల్గొన్నారు.

రేపటి నుండి గుణదల మేరీమాత ఉత్సవాలు

- బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు
- ఏర్పాట్లు పూర్తి

పోస్టర్ ఆవిష్కరణలో బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, ఫాదర్ సునీల్‌రాజు, వికార్ జనరల్, ఫాదర్ ఎం.గాబ్రియేలు, ఫాదర్ కొలకాని మరియన్న తదితరులు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఈనెల 9, 10, 11 తేదీల్లో గుణదల మేరీమాత మహోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు తెలిపారు. గుణదల సోషల్ సర్వీస్ సెంటర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోవిడ్ నేపథ్యంలో గత రెండేళ్ల నుండి గుణదల మాత మహోత్సవాలు నిర్వహించలేదన్నారు. కోవిడ్ అనంతరం నిర్వహిస్తున్న ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అంచనాలకు మించి యాత్రికులు తరలిరానున్నారని చెప్పారు. ఉత్సవాలను దష్టిలో ఉంచుకుని ముందుగా నవదిన ప్రార్ధనలు జనవరి 31వ తేదీ నుంచి ప్రారంభించామని తెలిపారు. నవదిన ప్రార్థనలు బుధవారంతో ముగియనున్నాయని చెప్పారు. 9వ తేదీ సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మరియమాతను తేరు ప్రదక్షిణగా గుణదల పరిసర ప్రాంతాల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు. మోన్సిన్యోర్ రెవ.ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ గత రెండు నెలల నుండి ఉత్సవాల ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ సమక్షంలో అన్ని ప్రభుత్వ శాఖలతో సమీక్షా సమావేశాలు జరిగాయన్నారు. భద్రత విషయమై పోలీసు, ఆరోగ్యం, శానిటరీ, తాగునీరు వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తూ నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. కొండ దిగువన అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని, అలాగే కొండ ఎగువ భాగంలో అస్వస్థకు గురైన వారికి వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ల వద్ద యాత్రికుల సౌకర్యార్థం సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్సి డైరెక్టర్ ఫాదర్ సునీల్‌రాజు, వికార్ జనరల్ ఫాదర్ ఎం.గాబ్రియేలు, (మిగతా 6లో)

ఉద్యమంగా ఈవేస్ట్ సేకరణ

కలెక్టర్ డిల్లీరావు పిలుపు

ఇవేస్ట్ సేకరణను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ : ఇ- వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) భవిష్యత్‌పై తీవ్ర దుష్ప్రభావం చూపనున్న నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉద్యమమంగా ఇ-వేస్ట్ సేకరణ చేపట్టి కాలుష్యాన్ని నివారించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. లయన్ ఇంటర్‌నేషనల్ డిస్టిక్ గవర్నర్ లయన్ దామర్ల శ్రీశాంతి ఆధ్వర్యంలో జిల్లాలో 30 రోజులపాటు నిర్వహిస్తున్న వరల్డ్ బిగ్గెస్ట్ ఇ-వేస్ట్ కలెక్షన్ డ్రైవ్‌ను మంగళవారం ఆయన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉండే లెడ్, కాడ్మియం, మెర్క్యూరీ (మిగతా 6లో)

కెవిపిఎస్ డైరీ ఆవిష్కరణ

డైరీని ఆవిష్కరిస్తున్న వి.శ్రీనివాసరావు, చిత్రంలో మాల్యాద్రి, దడాల సుబ్బారావు, నటరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) 2023 సంవత్సరం డైరీని మంగళవారం విజయవాడలోని శ్రీశ్రీ భవన్‌లో దళిత శోషణ్ ముక్తిమంచ్ జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, జి నటరాజు, సహాయ కార్యదర్శి జి క్రాంతికుమార్, నాయకులు నల్లపు కిషోర్, చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సామాజిక ఉద్యమ మహనీయుల జీవిత విశేషాలతో కూడిన డైరీని కెవిపిఎస్ తీసుకురావడం అభినందనీయమన్నారు. దళితుల సమస్యల పరిష్కార జిఓలు, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టంలోని అంశాలతో కూడిన ఈ డైరీ సామాజిక సమస్యలపై పనిచేస్తున్న ఉద్యమకారులకు కరదీపికగా ఉపయోగపడుతుందన్నారు.

బడ్జెట్‌పై 'విఎంసి' కసరత్తు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (విఎంసి)కి సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు ముమ్మరం చేశారు. ఈ ప్రక్రియలో సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు విఎంసి పరిధిలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై దృష్టి సారించారు. వీటికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టులకు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే విధంగా ఆలోచనలు చేస్తున్నారు. సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరంలో మార్చిలో విఎంసి బడ్జెట్‌ను సమర్పిస్తుంది. 2023-24 బడ్జెట్ సిద్ధం చేసేందుకు పలు కార్యక్రమాలకు అవసరమైన నిధులను కేటాయించేందుకు విఎంసిలోని ఆర్థిక విభాగం వివిధ విభాల నుంచి ప్రతిపాదనలు, అంచనాలను కోరింది. గతేడాది 2022-23లో రూ.1,114 కోట్ల బడ్జెట్‌ను విఎంసి ఆమోదించింది. ఇది గత ఏడేళ్లలో ఇది అత్యల్ప బడ్జెట్. 2019-20లో కోవిడ్-19 అనంతర నెలకొన్న పరిస్థితులతో పోలిస్తే విఎంసి బడ్జెట్ కేటాయింపులను 45 శాతం తగ్గించింది. బడ్జెట్ కేటాయింపులపైన, విఎంసి పరిధిలో వివిధ రహదారులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సరిపడిన విధంగా కేటాయింపులు జరగకపోవడంపైన నాడు ప్రతిపక్షాలు మండిపడ్డాయి. మరో వైపు మార్చిలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్ రూపకల్పనలపై మేయర్ ఆర్ భాగ్యలక్ష్మితో పాటుగా విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అందులో భాగంగా చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న కోర్ ప్రాజెక్ట్ లపై దష్టి సారించారు. దీనిపైన విభాగాల వారీగా సమీక్షలు నిర్వహించి ప్రాజెక్టుల స్థితిగతులపై అవగాహన కల్పించి తగినన్ని నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని (మిగతా 6లో)



గ్రామీణ విద్యార్థులు సివిల్స్‌లో రాణించేలా కృషి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంత విద్యార్థులను కూడా సివిల్స్‌లో ర్యాంకు సాధించే విధంగా శిక్షణ అందిస్తున్నామని శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర అన్నారు. ఎం.జి.రోడ్డులోని శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమి ఇటీవల రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా గ్లోబల్ అవార్డు తీసుకున్న సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్స్‌తో పాటు గ్రూప్ -1 పరీక్షలలోనూ ఎంతో మందికి శిక్షణ అందించడంతో ర్యాంకులు సాధించి వివిధ ప్రభుత్వ సంస్థలలో స్థిరపడ్డారని అన్నారు. తమ సంస్థ చేస్తున్న కృషిలో భాగంగా రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా గ్లోబల్ అవార్డును అందించారన్నారు. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, తనపై ఇంకా బాద్యత పెంచిందని రానున్న కాలంలో ఇంకా ఉత్సాహంగా కృషి చేస్తూ ఎంతో మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన తెలుగు విద్యార్థులకు సివిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఐఎఎస్‌లుగా తీర్చిదిద్దాలనేది తన కల అన్నార. ఆవిధంగా కృషి చేస్తామని తెలిపారు. అలాగే ఇటీవల సివిల్స్‌లో కూడా తమ విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారని తెలిపారు. గ్రూప్ -1 ఫలితాలలో కూడా తమ విద్యా సంస్థ నుంఇ 40 మంది అభ్యర్థులు వివిధ ప్రభుత్వ సంస్థలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈసమావేశంలో కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహసారధులే రారాజులు : కొక్కిలిగడ్డ

ప్రజాశక్తి-గంపలగూడెం: రానున్న కాలంలో గృహసారధులే రారాజులని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో మండలంలోని వివిధ గ్రామాల్లో నూతనంగా నియమించబడిన గృహసారథులు, వలంటీర్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటరీ పరిధిలో ఉన్న 50 గృహాల్లో ఏమైనా వ్యత్యాసాలు ఉంటే సమన్వయం చేసేందుకే ఈ గృహ సారధులని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగులముడి శ్రీలక్ష్మి, జడ్పిటిసి కే శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో రంజిత్‌రెడ్డి ప్రతిభ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: గత నెలలో జరిగిన జెఇఇ మెయిన్స్ మొదటి దశ అర్హత పరీక్షల్లో ఎస్సార్ జూనియర్ కళాశాల గుంటుపల్లి బ్రాంచ్‌లో ఎంపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొల్లి రంజిత్‌రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 99.70 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల యాజమాన్యం, సిబ్బంది రంజిత్‌రెడ్డిని అభినందించారు. కళాశాల డిజిఎం వెంకటరమణ మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ గల బోధనా సిబ్బంది పటిష్టమైన ప్రణాళిక ద్వారా విద్యార్థులకు అందించిన బోధన విధానం ద్వారా ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ ఎ.రవీంద్ర, జోనల్ ఇన్‌చార్జ్ కృష్ణారావు, కళాశాల ప్రిన్సిపల్ వీరేశంరెడ్డి పాల్గొన్నారు.

సిపిఎం నాయకులు ఘనికి పరామర్శ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సిపిఎం సీనియర్ నాయకులు, జగ్గయ్యపేట నియోజకవర్గ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎస్ఎ ఘని ఇటీవల అనారోగ్యానికి గురై విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొంది అనంతరం పట్టణంలోని తన స్వగృహానికి వచ్చారు. విషయం తెలుసుకున్న సిపిఎం జగ్గయ్యపేట పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు దంతాల వెంకటేశ్వర్లు, కోట కృష్ణ, ఎస్ రామనాథం, జుజ్జువరపు వెంకటరావు, బాలు ఆయనను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

'శ్రీ చైతన్య' రికార్డు ఫలితాలు

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: జెఇఇ మెయిన్స్-2023 ఫలితాలలో విజయవాడలోని శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు రికార్డు స్థాయి ఫలితాలు సాధించారని శ్రీ చైతన్య ఎగ్జిక్యూటివ్ ఏజిఎం మురళీకృష్ణ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థుల అభినందన సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వావిలాల చిద్విలాస్ రెడ్డి, దగ్గినేని వెంకట యుగేష్, గుత్తికొండ అభిరామ్, బిక్కిన అభినవ్ చౌదరి వంద పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 99.99 పర్సంటైల్ ఆరుగురు విద్యార్థులు, 99.98 పర్సంటైల్ సాధించిన విద్యార్థులు పదకొండు మంది, 99 పర్సంటైల్ సాధించిన

విద్యార్థులు 234 మంది ఉన్నారన్నారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డీన్స్ పివిరావు, మురళీరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-సింగ్‌నగర్: నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ తోటవారి వీధిలో రూ.కోటి

వ్యయంతో చేపట్టిన 14 బీటీ రోడ్ల నిర్మాణ పనులను నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. పనుల్లో జాప్యం జరగకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం 58వ డివిజన్ 241 వ వార్డు సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందిరానాయక్ నగర్‌లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, బసివిరెడ్డి, వసంత్ కుమార్, తోపుల వరలక్ష్మి, భోగాది మురళి, జాన్‌బాబు, వరప్రసాద్, జలీల్ ఖాన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

న్యూ హోప్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: చిల్లకల్లు న్యూ హోప్ స్కూల్లో న్యూ హోప్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగే ఉచిత మెగా వైద్యశిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించారు. శంకర నేత్రాలయం, మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో డాక్టర్ అరున్ లేక్ అమెరికా వారు ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ న్యూ హోప్ సంస్థ వారు గత 20 సంవత్సరాలుగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని, సంస్థ ప్రెసిడెంట్ రెవరెండ్ పాపబతిని ప్రభుదాస్ మరెన్నో సేవలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, న్యాయమూర్తులు శోభారాణి, శ్రావణి, శ్రీమతి రుత్ ప్రభుదాస్, రెవరెండ్ జయపాల్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తినేని విజయ శేఖర్, ఎంపీపీ మార్కాపుడి గాంధీ, దుర్గగుడి కమిటీ సభ్యులు నంబూరి రవి పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నందిగామ: నగర పంచాయతీ పరిధిలోని 9వ సచివాలయాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.జయరాం ఆకస్మిక తనిఖీ చేశారు. మూవ్మెంట్ రిజిష్టర్లు, సంక్షేమ పథకాల జాబితాలను పరిశీలించారు. సచివాలయ పరిధిలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు వంద శాతం వసూలు చేయాలని ఆదేవించారు. సకాలంలో పెన్షన్ అమౌంట్ పంచగా మిగిలిన మొత్తమును, మరియు సచివాలయములో సర్వీసెస్ కొరకు కట్టిన చలాన అమౌంట్‌ను బ్యాంకు నందు జమ చేయాలన్నారు.

తిరుపతమ్మకు అంకె సేవ

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరుణాళ్ల మహోత్సవంలో భాగంగా మంగళవారం శ్రీ అంకమ్మ అమ్మవారి క్రతువుల్లో భాగంగా కుమ్మరులు, రజకులు, బేతాళుడు, కొమ్మలు వారు ఆలయంలో ఉదయ పొంగళ్లు (అంకెసేవ) చేసి అమ్మవారికి నివేదించారు. ఆచారానికి అనుగుణంగా జల బిందెల మహోత్సవంలో జల బిందెలు మోసిన వారు ఇత్తడి పాత్రల్లో మూడు వత్తులు వెలిగించి ప్రధాన ఆలయంతో పాటు దేవతామూర్తుల ఆలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం బారినుండి వారితో ఒగ్గు కథ చెప్పించారు. పెద్దసంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్న కేశవరావు పాల్గొన్నారు.

మేటి పట్టణంగా జగ్గయ్యపేట : ఉదయభాను

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంతో పాటు మేటి పట్టణంగా జగ్గయ్యపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక చెరువు బజార్‌లోని ఊర చెరువు అభివృద్ధి పనులు, నీటి శుద్ధీకరణ పనులు, ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. మొదటగా ఐదు కోట్ల రూపాయల వ్యయంతో పట్టణంలోని చెరువును సుందరీకరిస్తున్నామన్నారు. దానిలో భాగంగా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, బోటు షికారు, లైటింగ్ తదితర హంగులతో సుందరవనంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు

తుమ్మల ప్రభాకర్, హఫీజున్నిసా, స్థానిక కౌన్సిలర్ తన్నీరు నాగేంద్ర నాగమణి, అల్ట్రాటెక్ సిమెంట్స్ యూనిట్ హెడ్ డాక్టర్ కె.శ్రీధర్, హెచ్‌ఆర్ హెడ్ ఏవీఎన్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11న ఎస్‌టియు కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి-కంచికచర్ల: ఈ నెల 11 న స్థానిక ఓసీ క్లబ్‌లో ఎస్‌టియు 76వ వార్షిక కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు వేముల భిక్షమయ్య తెలిపారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కౌన్సిల్ సమావేశాల కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ విక్టరీ నగేష్, జిల్లా కార్యదర్శి అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు గోపాలరావు, వెంకట్రావు, శ్రీనివాసరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సేవా కార్యక్రమాలతో జన్మదినోత్సవాన్ని నిర్వహించుకోవడం అభినందనీయమని సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో తన జన్మదినాన్ని పురస్కరించుకొని హెచ్ఐవి బాధిత పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేసిన శ్రీలత మహిళా సంరక్షణ అధికారిని ఆయన అభినందించారు. సమాజం హితం కాంక్షించేవారు ఇటువంటి సాంప్రదాయాన్ని పాటించాలని ఆయన సూచించారు.

సర్కిల్-1లో మొబైల్ కోర్టు

ప్రజాశక్తి-విజయవాడ: నగర వీధులలో జనావాసాలలోకి వస్తున్న పందులపై చర్యలలో భాగంగా పందుల పెంపకందారులపై చార్జిషీట్లను మొబైల్ కోర్టులో దాఖలు చేయవలసిందిగా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి యు.రామ్మోహన్ మంగళవారం సర్కిల్-1 కార్యాలయంలో మొబైల్ కోర్టును నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై శానిటరీ ఇనిస్పెక్టర్లు 48 కేసులు నమోదు చేసి వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వీటిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తులను, విచ్చలవిడిగా పశువులను రోడ్ల పైకి వదిలేసే వారిని, రోడ్ల పైన చెత్త వేసే వారిని గుర్తించి, నేరాల క్రింద వారికి న్యాయమూర్తి రూ. 14, 970 జరిమానాను విధించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయవలసిన బాధ్యత నగర వాసులపై ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు అధికారులు షాపులను తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ -1 కె.టి. సుధాకర్, హెల్త్ ఆఫీసర్లు డా.సురేష్ బాబు, పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణం చేయలేని దారిద్రపు రేఖ దిగువన ఉన్న పేదలకు స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.35 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎస్.దయవతి తెలిపారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లబ్దిదారులకు మంగళవారం కొండపల్లి మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ చేతుల మీదుగా లబ్దిదారులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పేద లబ్దిదారులకు రూ.35 వేలు రుణం అందిస్తున్నట్లు తెలిపారు. దయవతి మాట్లాడుతూ సులభ వాయిదాలలో తిరిగి రూ.1 వడ్డీతో తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వెనిగండ్ల రాము చేయూత

ప్రజాశక్తి - గుడివాడ

గుడివాడ నాగవరప్పాడులో అధికారులు కోర్టు అనుమతితో ఇరిగేషన్ స్థలంలో గత పదేళ్లుగా నివాసం ఉంటున్న పేదల పాకలు తొలగించి వేయడంతో రోడ్డున పడ్డ కుటుంబాలను వెనిగండ్ల రాము కార్యాలయం ప్రతినిధులు మంగళవారం టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ సత్యసాయి, మాజీ కౌన్సిలర్ బొంబాయి శీను, నందివాడ మండలం శంకరంపాడు సర్పంచ్ సుబ్బారావుల సమక్షంలో పలువురు ప్రతినిధులు బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరాశ్రయులై రోడ్డున పడ్డ కుటుంబాలకు వెనిగండ్ల రాము అండగా ఉంటారని హామీ ఇచ్చారు.

కాటూరులో డ్రోన్ సర్వే

ప్రజాశక్తి-ఉయ్యూరు

భూముల రీసర్వే ద్వారా ఖచ్చితమైన సమాచారం లభించేందుకు దోహద పడుతుందని ఉయ్యూరు ఆర్డీవో ఎన్.విజయకుమార్ అన్నారు. కాటూరులో డ్రోన్ ద్వారా భూముల సర్వే మంగళవారం ప్రారంభించారు. సర్వే వివరాలు నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. భూములు రీసర్వే చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. తహశీల్దార్ కె.మస్తాన్, డీఐఓఎస్ విజయవర్మ, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ డి. వెంకటేశ్వరరావు, సర్వేయర్ మదుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నిక

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మచిలీపట్నం పోస్టల్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఎన్ఎఫ్ పిఇ, ఏఐజెడియస్ ఘన విజయం సాధించింది. తొమ్మిది మంది డైరెక్టర్లు (పాలకవర్గసభ్యులు) గెలుపొందారు. అధ్యక్షులుగా జి.అంజిబాబు ఏకగ్రీవం కాగా ఉపాధ్యక్షులుగా సిహెచ్వి రాంబాబు, కార్యదర్శిగా పెదసింగు నాగరాజు, ట్రెజరరుగా చందన శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా డి.వి.సాంబశివరావు, జి.అంజిబాబు, శాయన రమేష్, పెదశింగు నాగరాజు, కె.వి దుర్గా ప్రసాద్, టిఎన్అర్ ప్రకాష్, చందన శ్రీనివాసరావు, చీదుల వెంకటేశ్వరారావు ఎన్నికయ్యారు.

స్టాక్‌మార్కెట్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఉయ్యూరు

స్టాక్ మార్కె పట్ల పూర్తి అవగాహన లేక పెట్టుబడుదారులు నష్టపోయే పరిస్థితులు ఏర్పడతాయని గుంటూరు టీజీపీఎస్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఏజీ అండ్ ఆర్ఎస్ఎస్ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ సంయుక్త ఆధ్వర్యంలో సెక్యూరిటీస్ బోర్డు ఆఫ్ ఇండి యా(సెబీ) అనే అంశముపై మంగళవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. పెట్టుబడి దారులు వాటాలు కొనుగోలు చేయడం వల్ల లాభనష్టాలు తదితర అంశాలను సవివరంగా తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి ఎన్.వసంతరావు, అధ్యాపకులు గోపీచంద్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు)

గన్నవరం నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ ఆదేశాల మేరకు నవరత్నాలు పేదలందరికి ఇల్లు పథకం కింద ఉంగుటూరు మండలంలోని వేమండలో గహ నిర్మాణాలు జరుగుతున్నాయి. మౌలిక వసతుల కల్పన పనులను మంగళవారంనాడు ఎంపిడిఒ జి.ఎస్‌వి శేషగిరిరావు పరిశీలించారు. మేమండ గ్రామంలో 43 మంది ఇళ్ల లబ్ధిదారులు ఉన్నారు. మౌలిక వసతుల కల్పనను ఆయన పరిశీలించారు.

మాతా శిశు మరణాలను తగ్గించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో మాతా, శిశు మరణాలు తగ్గించేలా వైద్య, ఆరోగ్యశాఖ పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్ భాష ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

ఛాంబర్‌లో వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా వైద్యసేవల సమన్వయ అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌సిహెచ్ నమోదు, మాతా, శిశు మరణాలు, గర్భిణుల నమోదు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాలు, ఆస్పత్రుల్లో పరిసరాల పరిశుభ్రత తదితర అంశాల పురోగతిపై వైద్యాధికారులతో మాట్లాడారు. గత సమావేశంలో తోట్లవల్లూరు కేసుకు సంబంధించి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వైద్యాధికారిపై చర్యలు ఏమి తీసుకున్నారంటూ డిఎంహెచ్ఒ డాక్టర్ గీతాబాయిని కలెక్టర్ ప్రశ్నించారు. కనీసం మెమోలు, వివరణ ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. ప్రతి కాన్పు ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలని సూచించారు. ఎన్‌సీడీ కేసులకు వెంటనే గుర్తించి వైద్యసేవలు అందించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీడీ సేవలను పెంచాలన్నారు. పీహెచ్‌సీ ల్యాబ్‌లలో అన్ని రకాల పరీక్షలు చేయాలని, గర్భవతులను గుర్తించి మూడు నెలల్లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. సిజేరియన్ కాన్పులను నిరోధించాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్ చేస్తే గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది ఖచ్చితంగా ఆసుపత్రిలోనే ఉండాలన్నారు. ఇటీవల మరణించిన గంద్రపు కావ్య, పామర్తి దివ్య, పాతూరి నాగమణి, పసుపులేటి రమ్యశ్రీల గురించి అడిగి తెలుసుకున్నారు. గుడ్లవల్లేరుకు చెందిన పామర్తి దివ్యకు సర్జరీ చేసే ముందు ఆమెకు దేహంలో ఇన్ఫెక్షన్ ఉందో లేదో తెలుసుకునేందుకు విఎస్ఆర్ పరీక్ష చేసి న్యుమోనియా లక్షణాలు ఎందుకు పసిగట్ట లేకపోయారని సంబంధిత వైద్యుడిని కలెక్టర్ అడిగారు. కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పసుపులేటి రమ్యశ్రీ మరణంపై కలెక్టర్ ఆరా తీశారు. మూడో కాన్పు కావడం, యాంటీ సైకోటిక్ మందులు ఆ పేషెంట్ వాడిన కారణంగా ఆపరేషన్ వికటించినట్లు సంబంధిత వైద్యుడు తెలియజేయడంతో జిల్లా కలెక్టర్ ఆ జవాబుకు సంతృప్తి చెందలేదు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతా బాయి, డిసిహెచ్ డాక్టర్ శర్మిష్ట, ఇతర వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నియంత్రించాలి : అరుణసారిక

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అనేక చట్టాలు చేసినప్పటికీ వాటి గురించి ప్రజల్లో అవగాహన లేక ఈ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని జిల్లా ప్రధాన న్యాయ

మాట్లాడుతున్న అరుణసారిక

మూర్తి అరుణ సారిక అన్నారు. కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మచిలీపట్నం కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థలో మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అనే అంశంపై శిక్షణ తరగతులను నిర్వహించారు. అరుణ సారిక ప్రారంభించి మాట్లాడారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన లేక కొందరు దుర్మార్గులు నేరాలు ఎక్కువగా చేస్తున్నారన్నారు. అవగాహన కల్పించడం కోసం జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీల్లో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, పోలీస్ అధికారులు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో ఏర్పాటుచేసి వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల శివరామకృష్ణప్రసాద్, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు, వివిధ ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపు నిబంధనలకు విరుద్ధం : కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : అధికారులను బెదిరించి, భయపెట్టి రికార్డులను తారుమారు చేసి కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములను కొట్టేయడానికి స్థానిక శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) వ్యూహ రచన చేశారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర విమర్శించారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీపై అంత అభిమానం ఉంటే సొంత డబ్బులు పెట్టి కార్యాలయాన్ని నిర్మించుకోవాలన్నారు. ప్రజలకు చెందిన ప్రభుత్వ ఆస్తులను ఏ విధంగా కేటాయిస్తారని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయం నిర్మాణం పేరుతో రూ.300 కోట్ల విలువ గల భూములు కొట్టేయడానికి స్థానిక శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య పథకం పన్నారని ఆరోపించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఆ భూమి పబ్లిక్, సెమీ పబ్లిక్‌గా ఉందన్నారు. దీని ప్రకారం పార్కులు, ఆట స్థలాలకు మాత్రమే కేటాయించాల్సి ఉందన్నారు. నగరంలో అధికార పార్టీ నాయకులు అక్రమాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీసులు తమను అడ్డుకొని అన్యాయంగా అరెస్టు చేసి రోజంతా తిప్పారన్నారు. చివరికి న్యాయమే గెలిచిందని గుర్తు చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు మాట్లాడుతూ పోలీసులకు కేటాయించిన స్థలాన్ని అధికార పార్టీ నాయకులు కబ్జా చేస్తుంటే పోలీసులు మాట్లాడకపోవటం శోచనీయమనానరు. ఇంకా ప్రజలు ఆస్తులను ప్రాణాలను ఏ విధంగా కాపాడతారని ప్రశ్నించారు ఈ సమావేశంలో కార్పొరేటర్ దేవరపల్లి అనిత,చిత్తజల్లు నాగ రాము, పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇలియాస్ పాషా, వెంకన్న ,మరియు పార్టీ నగరకమిటీ నాయకులు మురళీకృష్ణ, లంకిశెట్టి నీరజ ఉన్నారు.

మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

రాజ్యాంగ వ్యవస్థలపై దాడి

ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-బంటుమిల్లి

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ వ్యవస్థపై దాడి పెరిగిందని శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు విమర్శించారు. బంటుమిల్లి డిగ్రీ కళాశాలలో

మాట్లాడుతున్న కె.ఎస్.లక్ష్మణరావు

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో '75 సంవత్సరాల స్వాతంత్రం పయనం ఎటువైపు' అనే అంశంపై ఏర్పాటుచేసిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన పాలకులు ఎల్ఐసి, బ్యాంకులు, రైల్వేలు, పోస్టాఫీసులు, టెలికంరంగాన్ని ప్రయివేటు, కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. బంటుమిల్లి డిగ్రీ, ప్రభుత్వ జూనియర్, వాగ్దేవి జూనియర్ కళాశాలలు, బంటుమిల్లి హైస్కూల్ నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎస్.సమరం, జిల్లా అధ్యక్షులు సుఖేష్, డివైఎఫ్ఐ కృష్ణాజిల్లా కన్వీనర్ టి.బాజీబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహనరావు, జూనియర్ కళాశాల, హైస్కూల్, వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రిన్సి పల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఘంటసాల తహశీల్దారు రామనాయక్

ప్రజాశక్తి-ఘంటసాల

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న వైఎస్సార్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని తహశీల్దార్ బి.రామానాయక్ వీఆర్వోలకు సూచించారు. ఘంటసాల మండలవ్యాప్తంగా ఉన్న లేఔట్లలో గృహ నిర్మాణాల పురోగతిపై మండలానికి చెందిన వీఆర్వోలతో తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించేలా అధికారులంతా సమన్వయంతో కృషిచేయాలని కోరారు. ప్రభుత్వం పేదలకు అందించిన నివేశనా స్థలాల లేఔట్లలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. లబ్ధిదారులకు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ట ప్రభుత్వం గహ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, జిల్లాస్థాయి అధికారుల ఆదేశాలను ప్రతి ఒక్కరు అనుసరించాలని, ఇంకా ప్రారంభం కానీ లేఔట్లలో గహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆశ ఉద్యోగి మట్టా రూతమ్మ ఉద్యోగ విరమణ

ఉయ్యూరు : ఆశా ఉద్యోగులు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల్ని ఆరోగ్యవంతులుగా ఉంచడంలో కీలకపాత్ర వహిస్తున్నారని కాటూరి గ్రామ సర్పంచ్ కొడాలి ఆశాలత అన్నారు. మండలం కాటూరు గ్రామంలో మంగళవారంనాడు ఆశా డే సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన రూతుమ్మకు పి.హెచ్.సి వైద్య అధికారులు, సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఆశ కార్యకర్తలు చేస్తున్న కృషి చాలా విలువైందన్నారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శివ నాగేంద్రం

మాట్లాడుతూ రూతుమ్మ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారని గుర్తుచేశారు. అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సజ్జా బాలగంగాధర్, అధ్యక్షులు ఎస్కే ఇస్మాయిల్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.రాజేష్, రైతు సంఘం మండల నాయకులు అన్నే సుబ్బారావు, వైద్యాధికారి దీప్తి, ఆశ కార్యకర్తలు రాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-భవానీపురం: హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ శివరామ క్షేత్రం శ్రీ కోదండ రామాలయంలో మార్చి 30వ తేదీన జరుగనున్న శ్రీ రామనవమి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ ఏడాది 36వ శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. శ్రీరామ నవమి రోజున 108 మంది దంపతులతో శ్రీ సీతారాముల కళ్యాణం వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక 42వ డివిజన్ కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి, ఆలయ అధ్యక్షులు జింకా చక్రధర్, కార్యదర్శి పోలు సాంబశివరావు, కోశాధికారి సుబ్రమణ్య గుప్త, ఉపేంద్ర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడరూరల్: ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు తెలిపారు. గ్రామంలోని దళిత కాలనీ లో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్, డ్రైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆయా పనులు ను మంగళవారం పరిశీలించిన రంగారావు మాట్లాడుతూ గ్రామంలో అన్ని రోడ్డులను పూర్తిస్థాయిలో ప్రాధాన్యత క్రమంలో సిమెంట్ రోడ్‌లుగా తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రసూల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హేమంత్ పాల్గొన్నారు.

తృటిలో తప్పిన బస్సు ప్రమాదం

ప్రజాశక్తి-గంపలగూడెం: తిరువూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరువూరు నుండి కంచికచర్ల వెళ్లి వస్తున్న నేపథ్యంలో సాంకేతిక లోపంతో ప్రమాదం తప్పింది. మంగళవారం మండలంలోని గోసవీడు దాటిన తర్వాత స్టీరింగ్ రాడ్ వదిలివేయడంతో బస్సు పూర్తిగా సైడ్‌కు వెళ్లిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ప్రమాదం జరగకుండా చూడడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-గంపలగూడెం: మండల కేంద్రమైన గంపలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గల అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో వైపి రెడ్డి పరిశీలించారు. కేంద్రంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార ఉత్పత్తులు ఎలా అందుతున్నాయన్నది పరిశీలించారు. అనంతరం గుర్తించిన లోపాలను సరిచేసుకోవాలని సూచించారు.

నేత్ర దానం

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని గోసవీడు గ్రామానికి చెందిన సానికొమ్ము సీతారామిరెడ్డి (78) మంగళవారం ఉదయం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సీతారామిరెడ్డి కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఖమ్మం నేత్రాన్నిధికి ఆయన నేత్రాలను దానం చేసినట్లు అడ్వకేట్ అండ్ నోటరీ గోగిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు.

10న వాహనాల వేలం

ప్రజాశక్తి-నందిగామ: ఈ నెల 10వ తేదీన ఎస్ఇబి మైలవరం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నందిగామ ఎస్ఇబి స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం పాటలు నిర్వహించటం జరుగుతుందని నందిగామ సబ్‌స్టేషన్ స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో ఎన్. ఇంద్రజిత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

వైసిపి వ్యాఖ్యలు సరికాదు : ఉమా

ప్రజాశక్తి-నందిగామ: నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం తంగిరాల ఫ్యామిలీ అని, అలాంటి ఫ్యామిలీని నందిగామను దోచుకునే మొండితోక బ్రదర్స్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి దేవినేని ఉమా అన్నారు. పట్టణంలోని సౌమ్య కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అవినీతి బురదలో దొర్లాడే వైసిపి నాయకులు తమ ఒంటికంటిన బురదను ఎదుటివారికి పులమాలనుకోనే తీరు శోచనీయమన్నారు. గత కొన్ని రోజులుగా వైసీపీ నాయకుల వ్యాఖ్యల తీరు సరిగ్గాలేదన్నారు. ఓడిపోతామని భయంతోనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజానీకం టిడిపికి పట్టం కట్టడం తథ్యమన్నారు.

అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి

మధురానగర్లో పౌర సంక్షేమ సంఘం ధర్నా

ఆర్‌యుబి పనులు పూర్తి చేయాలని ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ: మధురానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యుబి) పనులు పూర్తి చేయాలని, పాడైపోయిన రోడ్లు బాగు చేయాలని కోరుతూ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పౌరసంక్షేమ సంఘం నాయకులు భూపతి రమణారావు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మధురానగర్ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గత ఐదు సంవత్సరాలుగా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం వలన మధురానగర్ చుట్టుపక్కల ఉన్న ప్రజలు నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు గడపగడపకు కార్యక్రమానికి వెళ్లినప్పుడు దీనిపై ప్రశ్నించడం జరిగిందని, అయినా ఎమ్మెల్యే స్పందిస్తున్న పరిస్థితి లేదన్నారు. విజయవాడ నగరం కృష్ణానది పక్కనే ఉన్నప్పటికీ ఇళ్లకు నీటి మీటర్లు బిగించి ప్రజలపై నీటి భారాన్ని మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి మీటర్లు పెట్టి లీటర్ల చొప్పున లెక్క గట్టి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నారన్నారు. భారమైన నీటి మీటర్లకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె దుర్గారావు, పౌరసంక్షేమ సంఘం నాయకులు వై.కృష్ణయ్య, బి.చిన్న, కొరమయ్య, ప్రదీప్, జగదీష్, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్లకు ఉపయోగపడేలా కేంద్ర బడ్జెట్'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కేంద్ర బడ్జెట్ వల్ల పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ఒరిగిందేమీ లేదని, కార్పొరేట్లకు మాత్రమే అనుకూలమైన బడ్జెట్ అని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలో మంగళవారం కేంద్ర బడ్జెట్‌పై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఐద్వా నాయకులు సోమోజు నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ బడ్జెట్‌లో విభజన చట్టంలోని అంశాలు లేవని, ఏపీకి ప్రత్యేక హోదా వంటి ఊసే లేదన్నారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్ట్, ఐఐటి, ఐఐఎం, ట్రిబుల్ ఐటీ వంటి వాటికి నిధులు కేటాయించలేదన్నారు. ఉపాధి హామీ, ఆహార సబ్సిడీ, ధాన్యం సేకరణ, వ్యవసాయం, ఎరువులు, గృహ నిర్మాణాలకు ఈ బడ్జెట్‌లో నిధులు కోత విధించారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయకుండా ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న జరిగే బడ్జెట్ ప్రతుల దహన కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కాకబోయిన లింగారావు, కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, జుజ్జువరపు వెంకటరావు, షేక్ మీరాసాహెబ్, బాలు, కరీమా, బూసమ్మ, నాగరాణి, విజయలక్ష్మి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

విస్సన్నపేట: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్లో సిపిఎం నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి, కార్మిక వర్గానికి, వ్యవసాయ కూలీలకు తగిన ప్రాధాన్యత లేని బడ్జెట్‌గా ఉందని, లక్షల కోట్లు బడా కంపెనీలకు, కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తూ పేదలను, రైతులను విస్మరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చింత శ్రీనివాసరావు, హర్ష, చిరంజీవి, సునీల్ పాల్గొన్నారు.

నవరత్నాలతో సుపరిపాలన : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కంచికచర్ల: ప్రజలకు నవరత్నాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు అన్నారు. పరిటాలలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత జగన్‌దే అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు సమాంతరంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యద్దనపూడి జోష్ణ, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మార్త రజిని శ్రీనివాస్, నాయకులు చింతా రవీంద్ర, వేల్పుల రమేష్, తహశీల్దార్ వి రాజకుమారి, ఎంపిడిఓ కె.బాలశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నున్నకు కృష్ణా జలాలు : ఎస్ఇ

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: నున్న గ్రామంలో మంచినీటి వనరుల అభివృద్ధికి రూ.3.28 కోట్లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ డి.వెంకటరమణ తెలిపారు. రానున్న కాలంలో కృష్ణా నీరు గ్రామానికి వచ్చేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం నున్న గ్రామానికి వచ్చిన సందర్భంగా సర్పంచ్ కె.సరళ, ఉపసర్పంచ్ కె.బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శి జిటివి రమణలతో చర్చించారు. గ్రామానికి మంజూరైన నిధులు రూ.3.28 కోట్లతో రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్, మైక్రో ఫిల్టర్, ట్యాంక్‌ల వద్ద సంప్‌ల నిర్మాణం, పైప్‌లైన్లు అభివృద్ధి చేయాలని పాలకవర్గం సూచనలు ఇచ్చింది. గతంలో మంజూరైన రూ.1.10 కోట్లతో జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో నీటి వనరుల శాఖ అధికారులు ప్రసాద్, దయానంద్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-భవానీపురం: మైనార్టీల సంక్షేమం కోసం ప్రతి నియోజకవర్గంలో ఇస్లామిక్ బ్యాంక్‌లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆజుమన్-ఎ-ఇస్లామియా విజయవాడ ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజా మొహినుద్దీన్, ప్రధాన కార్యదర్శి షేక్ నాగూర్ కోరారు. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో మైనార్టీ వెల్ఫేర్ స్పెషల్ సెక్రెటరీ ఏ.ఎం.డి ఇంతియాజ్ అహ్మద్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల మేనిఫెస్టోలో ముస్లింలకు ఏపీలో ఇస్లామిక్ బ్యాంకులు ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు అందజేస్తామని చెప్పారని, నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు చెందిన పలు అంశాలతో పాటు విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న ముస్లిం మైనార్టీలకు వక్ఫ్ స్థలాల్లో గహాలు నిర్మించి వక్ఫ్ బోర్డు వారు లీజులు పొందాలని కోరారు.

దుర్గగుడి వద్ద కొండచిలువ కలకలం

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడి కింద కొండ చిలువ మంగళవారం కలకలం సష్టించింది. విద్యాధరపురం కుమ్మరిపాలెం నుండి దుర్గగుడికి వెళ్లు మార్గంలోని కెఎల్ రావు హెడ్ వాటర్స్ వర్క్స్ ఎదురుగా గల దుర్గగుడి కొండకు కట్టిన రిటైనింగ్ వాల్ దిగి రోడ్డుపైన గల ఫుట్‌ఫాత్‌పైన జాతీయ రహదారి మీదకు కొండచిలువ వచ్చింది. అది పొడవుగా, ఉదర భాగం లావుగా ఉండడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు, ప్రజలు చూసి భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు కొండచిలువను పట్టుకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పింఛన్లు పునరుద్ధరించాలని మేయర్‌కు వినతి

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరంలో తొలగించిన వేలాది సామాజిక పింఛన్లను పునరుద్ధరించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మికి టిడిపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగర వ్యాప్తంగా నాలుగు వేల మందికి నోటీసులిచ్చి, రెండు వేల మందికి పింఛన్లను తొలగించడం దారుణమన్నారు. ప్రతి పింఛన్‌దారుడికి కొత్తగా రూ.250 పెంచామనే పేరుతో పెద్దఎత్తున పింఛన్లు తొలగించడం శోచనీయమన్నారు. తక్షణమే సచివాలయ సిబ్బంది ద్వారా తొలగించిన వారందరికీ పింఛన్లను పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రజలను జాగృతం చేయటమే లక్ష్యం

ఎపి ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల కమిషనర్ అరుణ్ కుమార్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

వినియోగదారుల హక్కులపై ప్రజలను చైతన్యం చేయటమే లక్ష్యంగా కృషిచేస్తున్నామని ఎపి ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల కమిషనర్ హెచ్. అరుణ్‌కుమార్ అన్నారు. కృష్ణా యూనివర్శిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్, బిజినెస్ మేనేజ్మెంట్, ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల విభాగం, రాష్ట్రప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో యూనివర్శిటీలోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో మంగళవారం కార్యశాల జరిగింది. కార్యశాలకు అధ్యక్షులుగా యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.రామమోహనరావు వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హెచ్.అరుణ్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై కేవలం ఐదు శాతం మందికే అవగాహన ఉందన్నారు. అవగాహన పెంపొందించేందుకు, వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలు, పలు సంస్థలు నిరంతరం కృషిచేస్తున్నాయని వివరించారు. ఇలాంటి కార్యశాలలు ఏర్పాటు చేయటం ద్వారా మరికొందరికి అవగాహన పెంపొందించటానికి కృషిచేసుతన్నామన్నారు. ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకొని చుట్టూ వున్న సమాజాన్ని చైతన్య పర్చారన్నారు. నేటి విద్యార్థులే రేపటి వినియోగదారులన్న అంశాన్ని గుర్తించి పాఠశాలస్థాయి నుంచి యూనివర్శిటీల స్థాయిలో కూడా ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపకులపతి కె.రామమోహనరావు మాట్లాడుతూ భారతదేశంలో

మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

పూర్వ కాలం నుంచి వ్యాపారానికి సంబంధించి, వినియోగ దారుల హక్కులకు సంబంధించిన చట్టాలు ఉన్నాయని వివరించారు. 1986 ముందు నాటికే వినియోగదారుల హక్కులకు సంబంధించి సుమారు 27-30 చట్టాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ వినియోగ దారుల హక్కులపై అవగాహన కలిగి ఉండి ఈ అంశం పై సమాజాన్ని జాగృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్క వ్యాపారానికి వినియోగదారుడే మూలమని భావించి వ్యాపారస్తులు, సంస్థలు గౌరవించాల్సిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రతి వినియోగదారుడు తన హక్కులను తెలుసుకున్నపుడే తనని తాను దోపిడీకి గురవకుండా రక్షించుకుంటాడన్నారు. కేవలం తొమ్మిది మంది గృహిణిలు వినియోగదారుల హక్కుల కోసం కన్స్యూమర్ గైడెన్స్ సొసైటీ అఫ్ ఇండియాను స్థాపించారని గుర్తుచేశారు. విశిష్ట అతిథిగా వినియోగదారుల ఫోరం కృష్ణాజిల్లా మాజీ సభ్యులు డాక్టర్ పి.వి ఎస్.మూర్తి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల చట్టం-2018, 2019 గురించి సోధాహరణంగా వివరించారు. ఆసుపత్రులు అందించే సేవలు కూడా వినియోగదారుల వ్యవహారాల క్రిందకే వస్తాయన్నారు. తప్పుడు ప్రకటనల ద్వారా వినియోగదారులను తప్పుదోవ పట్టించుటకు ప్రయత్నించిన సెన్సడైన్, నాప్టాల్ లాంటి సంస్థలకు సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ విధించిన వేసిన జరిమానాల గురించి వివరించారు. త్వరలో 'రైట్ టూ రిపేర్ యాక్ట్' తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ రెక్టార్ ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామిరెడ్డి, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ జయశంకర ప్రసాద్, అధ్యాపకులు శ్రావణి, పద్మజ జ్ఞానేశ్వరి, శంకర సిద్దార్థ, జగదీశ్ పాల్గొన్నారు.

కెవిపిఎస్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కెవిపిఎస్-2023 నూతన డైరీని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మంగళవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కమిటీ జిల్లాలో ఉన్న కొన్ని ప్రధాన సమస్యలు శ్మశాన భూముల

కెవిపిఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న మారుమూడి విక్టర్‌ప్రసాద్, నాయకులు

సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మచిలీపట్నంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి కొనుగోలు పథకాన్ని నిధులు విడుదల చేయాలని, చర్మకారులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరుచేయాలని కోరారు. పెండింగ్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ కొన్ని మండలాల్లో శ్మశాన భూమి సమస్య పరిష్కరించామని ఇంకా పరిష్కారం కాని మండలాల్లో చర్యలు తీసుకుంటానన్నారు. అధికారులతో మాట్లాడుతానని ,అవసరమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్, కొడాలి శర్మ, సుధాకర్, ఎం.విల్సన్ శ్యామ్ సన్, వెంకటేశ్వరరావు, బి.రాజు, సిహెచ్ శ్రీనివాస్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ ఎపిఎంను విధుల నుంచి తొలగించాలి : ఐద్వా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మొవ్వ వెలుగు ఆఫీస్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహిళపై వేధింపులకు పాల్పడిన ఏపీఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న బాధిత మహిళను మంగళవారం

పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

పరామర్శించారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి వెలుగు ఏపీఎంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో ఇప్పటికైనా జిల్లాలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటుచేయాలని కోరారు.కమిటీ వివరాలు నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచాలని డిమాండ్‌చేశారు. బాధితురాలని పరామర్శించిన వారిలో ఐద్వా మచిలీపట్నం కార్యదర్శి కే.సుజాత, సిఐటియు పట్టణ కార్యదర్శి సిహెచ్ జయరావు ఉన్నారు.

వైసిపి నాయకుల పరామర్శ

కోడూరు : గత కొద్ది రోజుల కిందట ప్రమాదంలో గాయపడిన సీనియర్ మెకానిక్, కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామ వైసిపి నేత కటారి గంగాధర్‌రావును ఆ పార్టీ నేతలు మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పిఎసిఎస్ చైర్‌పర్సన్లు పరిసే మాధవరావు, కటకం కుటుంబరావు, వార్డు సభ్యుడు వెర్రి శ్రీనివాసరావు, పిఎసిఎస్ మాజీ చైర్ పర్సన్ కొక్కిలిగడ్డ శ్రీమన్నారాయణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

గంగాధరరావును పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

మాట్లాడుతున్న విసి రామమోహనరావు

కేంద్రబడ్జెట్‌పై చర్చ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కృష్ణా యూనివర్శిటీలో మంగళవారం యూనియన్ బడ్జెట్‌పై చర్చా కార్యక్రమం జరిగింది. యూనివర్శిటీ వైస్‌ఛాన్సిలర్ కె.రామమోహనరావు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్‌గా మచిలీపట్నంకు చెందిన ప్రముఖ ఆడిటర్ కె.శివ రాంకుమార్, విన్ నర్వ్ ఇన్ఫో సర్వీసెస్‌కి చెందిన జె.లక్ష్మీకాంత్ వ్యవహరించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మారుతీ మాట్లాడుతూ బడ్జెట్‌లో వివిధ శాఖలకు సంబంధించి కేటాయింపుల గురించి తెల్సుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా వైస్ ఛాన్సిలర్ కె.రామమోహనరావు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న వ్యవసాయానికి కేటాయింపులు పెరిగాయన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన డెయిరీ, ఫిషరీస్, హార్టికల్చర్‌కి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. జనాభాలో అత్యధిక శాతం వున్న యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించటానికి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, శిక్షణా సంస్థలకు ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేశారన్నారు. రక్షణ రంగంలో పెట్టుబడులు పెరిగాయన్నారు. రక్షణ రంగంలో అనేక వస్తువులు మనమే స్వంతంగా తయారు చేసుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి జయశంకర ప్రసాద్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల వారికి కూడా మేలు జరిగే విధంగా ఈ బడ్జెట్ రూపొందించారన్నారు. ఆడిటర్ కె.శివరామకుమార్ మాట్లాడుతూ ఆదాయ పన్ను, బడ్జెట్‌లో కేటాయింపులు గురించి వివరించారు. జె.లక్ష్మీకాంత్ మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యార్థులకు, యువతకు ఉపయుక్తమైన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా కన్స్యూమర్ ఫోరం పూర్వ సభ్యుడు పి.వి.వి.ఎస్.మూర్తి, యూనివర్శిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షురాలుగా సువర్ణలత

గన్నవరం : గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు ఉపాధ్యాయు సంఘం కో-ఆపరేటివ్ బ్యాంకు ఎన్నికలు మంగళవారం జరిగాయి. గన్నవరం మండలం నుంచి 2, ఉంగుటూరు మండలం నుంచి 3, బాపులపాడు మండలం నుంచి 3 డైరక్టర్లు ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తరుపున బాపులపాడు మండలం వీరవల్లి గ్రామం ఆర్‌పిహెచ్ కాలనీ మండల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఎస్.సువర్ణలత గన్నవరం కోఆపరేటివ్ టీచర్ సొసైటీ బ్యాంకు అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా వేలేరు గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎస్.రాజశేఖర్, సిరివాడ మండల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జి.శివశంకర్‌రెడ్డి డైరక్టర్‌గా ఎన్నికయ్యారు. టీచర్స్ కో-ఆపరేటివ్ బ్యాంకు స్థాపించి గడచిన 45 ఏళ్ల బ్యాంకు చరిత్రలో మహిళ ఉపాధ్యాయులను అధ్యక్షురాలను ఎన్నుకోవటం ఇదే ప్రథమం. నూతన కార్యవర్గాన్నికి పలువురు శుభాకాంక్షాలు తెలిపారు.

బస్సు సర్వీసులు సకాలంలో నడిచేలా చర్యలు : ఆర్ఎం

పెనమలూరు : పెనమలూరు మండలం కానూరు సనత్‌నగర్ ప్రాంతానికి నడుస్తున్న సిటీ సర్వీసులు గతంలో మాదిరిగానే నిర్ణీత సమయంలో నడిచేలా చర్యలు తీసుకుంటామని విజయవాడ ఆర్టీసీ ఆర్ఎం డి.వై.దానం హామీ ఇచ్చారు. కానూరు సనత్‌నగర్ ప్రాంతంలో ప్రతిరోజూ ఉదయం నుంచీ రాత్రి వరకూ అరగంట ఆలస్యంగా సర్వీసులు నడస్తున్నాయని స్థానిక అక్సా మస్జిద్ కమిటీ సభ్యులు మంగళవారంనాడు విజయవాడలోని కార్యాలయంలో ఆర్ఎంను కలిసి ఈ మేరకు అర్జీని సమర్పించారు. తమ ప్రాంతంలో గత 20 రోజులుగా తిరిగే సిటీ సర్వేసులు ఉదయం 7.20 గంటలకు రావాల్సిన బస్సు 8.30కు, 8.30కు రావాల్సిన సర్వీసు 9.30కు, 11 గంటలకు రావాల్సిన బస్సు 12 గంటలకు వస్తున్నాయని తెలిపారు. గత 20 రోజులుగా రోజుమొత్తంలో ఉదయం నుంచి రాత్రి 9 గంటలకు రావాల్సిన అన్ని సర్వీసులు ఆలస్యంగా రావటం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని పేర్కొన్నారు. దీనికి ఆర్ఎం సానుకూలంగా స్పందిస్తూ అధికారులతో మాట్లాడి పాత పద్ధతిలోనే బస్సులు తిరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనార్టీ నాయకులు మహ్మద్ సిద్ధిక్, అక్సా మసీదు ప్రెసిడెంట్ మహ్మద్ సనీవుల్లా, సెక్రటరీ డాక్టర్ మునీర్‌ఖాన్, మీరా, సాబు, ఖలీల్, మగ్బుల్ పాల్గొన్నారు.

ఆర్ఎం డి.వై.దానంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

1న వేతనాలు, పింఛన్ల చెల్లింపునకు చట్టబద్ధత

వివిధ ఉద్యోగ సంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఉద్యోగుల వేతనాలు, పింఛన్ల చెల్లింపులకు చట్టబద్ధత కల్పించాలని పలు ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "ఉద్యోగులు- వేతనాలు-చట్టబద్ధత మార్గదర్శకాలు' అన్న అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యాన మంగళవారం మచిలీపట్నంలోని జి కన్వెన్షన్ హాల్లో ఉద్యోగ సంఘాల చర్చా వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు చెల్లింపులపై ఇప్పటి వరకు చట్టం లేదన్నారు. అందువల్ల వచ్చే బడ్జెట్ సమావేశాల్లో వీటిపై చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్చ వేదికలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసిఇయు) మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి కిషోర్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల సంఘం కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి రాము, తోట వరప్రసాద్, ఎపియుఎస్ అధ్యక్షులు ఫణి ప్రశాంత్, సచివాలయం ఎంప్లాయీస్ జిల్లా కోఆర్డినేటర్ గోపీచంద్, సిపిఎస్ ఉద్యోగ సంఘ అసోసియేషన్ జిల్లా సభ్యులు పి సౌజన్య, యుటిఎఫ్ నాయకులు సుబ్రహ్మణ్యంతోపాటు ఎపిటిఎఫ్, ఫిషరీస్, కమర్షియల్ టాక్స్, హ్యాండ్లూమ్స్, పంచాయతీ సెక్రటరీ, వెటర్నరీ, లోకల్ ఫండ్, అగ్రికల్చరల్ అసోసియేషన్ల నుండి పలువురు నేతలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలి

విస్సన్నపేట : ఉపాధి హామీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి గ్రామ శివారు సత్తెనగూడెంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రాంతానికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీల పని డబ్బులు విడుదల చేయడంలో జాప్యం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేయాలని చేస్తోందన్నారు. బడ్జెట్లో నిధులను కుదించిందన్నారు. వెంటనే పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ బకాయిలను విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలూరి ప్రసన్న రావు పాల్గొన్నారు.

అయాన్ హాస్పిటల్ సేవలు అభినందనీయం

బిబిఎ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విష్ణు, శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అయాన్ హాస్పిటల్ వారి సేవలు అత్యంత ప్రయోజనకరమైనవని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విష్ణువర్ధన్, గంధం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బెజవాడ బార్ అసోసియేషన్ హాల్లో అయాన్ ఐ హాస్పిటల్ వారు ఏర్పాటు చేసిన ఉచిత అధునాతన మెగా నేత్ర వైద్య శిబిరం ప్రారంభోత్సవం వారు మాట్లాడుతూ కంటి ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. న్యాయవాదులు, న్యాయస్థానాల ఉద్యోగులు, న్యాయవాద గుమస్తాలు, వారి కుటుంబ సభ్యుల ప్రయోజనార్థం నిర్వహించిన ఈ శిబిరంలో 626 మందికి దృష్టి దోషాలపై పరీక్షలు జరిపారు. శుక్లాలు, నీటి కాసులు మొదలైన వ్యాధులను నిర్ధారించారు. అవసరమైన వారికి మందులు, ఐ డ్రాప్స్ ఇచ్చారు. కాలం చెల్లిన కళ్లజోళ్లు వాడుతున్న వారికి తగిన సూచనలు చేశారు. ఎంజె నాయుడు హాస్పిటల్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత్ శర్మ క్యాటరాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రజనీకాంత్ శర్మతోపాటు అయాన్ హాస్పిటల్ డాక్టర్ బషీర్ అహ్మద్‌ను బెజవాడ బార్ అసోసియేషన్ వారు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు పాలనా బాధ్యతలు అప్పగించాలి

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడును మంగళవారం గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.జానీ పాషా కలిసి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు వీలైనంత త్వరగా పంచాయతీల పాలనా బాధ్యతలు అప్పగించాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే పాలనా బాధ్యత ఫైల్‌ను ఆమోదించి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు పి.మనోహర్, ఎస్‌కె.మహబూబ్, జి.నవీన్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిపాదన వస్తే కొండపల్లి ఖిల్లా అభివృద్ధి

ఎంపి కేశినేని ప్రశ్నకు మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తే కొండపల్లి ఖిల్లాను అడాప్ట్ ఎ హెరిటేజ్ పథకం కింద అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. విజయవాడ ఎంపి కేశినేని నాని మంగళవారం పార్లమెంట్లో కొండపల్లి కోటను అడాప్ట్ హెరిటేజ్ స్కీమ్ కింద చేర్చడంపై లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిస్తూ ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి తమకు ఎటువంటి ప్రతిపాదనలూ రాలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ప్రాజెక్ట్ కింద గండికోట కోట వద్ద సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి, అప్‌గ్రేడ్ చేయడానికి, నిర్వహించడానికి దాల్మియా భారత్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు.

జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీల ఓవరాల్ ఛాంప్ జివితేష్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కుమారుడు, నలంద విద్యార్థి ఎస్.జివితేష్ జాతీయ స్థాయి చేతిరాత పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు. హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్, అమ్మఒడి హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆలిండియా గ్రాఫాలజిస్ట్ సంస్థ ప్రతి మాడ్యేళ్లకోసారి నిర్వహించే ఒలింపియాడ్

జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 4,112 ప్రైవేట్ పాఠశాలలు, 900 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1 నుండి పదో తరగతి విద్యార్థులు సుమారు 30 లక్షల మంది ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నట్లు హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ మెహబూబ్ హుస్సేన్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన జివితేష్ జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించినట్లు తెలిపారు. ఇంకా ఏలూరు భాష్యం స్కూల్‌కు చెందిన ఆలపాటి ప్రహర్షిక నేషనల్ ఎక్సలెన్స్ హ్యాండ్ రైటింగ్ ఛాంపియన్ షిప్‌ను, విజయవాడ ఫ్రీడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన అవ్యక్త ప్రద్యుమ్న పూజారి మిస్ ఇండియా బెస్ట్ హ్యాండ్ రైటింగ్ ఛాంపియన్ షిప్‌ను సాధించిన్నట్లు తెలిపారు. విజేతలకు జాతీయ చేతిరాత నిపుణులు భువన చంద్ర శిక్షణ ఇచినట్లు తెలిపారు. విజేతలకు వారి కుటుంబ సభ్యులు, పలువురు జిల్లా అధికారులు, విద్యా సంస్థల యాజమానులు అభినందనలు తెలిపారు.

ఆటోనగర్లో డంపింగ్ యార్డ్ పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఆటోనగర్ 6వ రోడ్డులో గల డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లో చెత్త వాహనాలు నిలిపివేపోవడం చూసి నూతనంగా వేయింగ్ మిషన్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్యం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్వహణ విధానాన్ని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు.

సానుభూతి కోసం కొల్లు డ్రామా

బందరు ఎంఎల్ఎ పేర్ని నాని

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అత్యంత విలువైన భూములను పార్టీ కార్యాలయాల కోసం సుదీర్ఘకాలంపాటు లీజుకుతీసుకున్న టిడిపి నేతలు... వైసిపి కృష్ణాజిల్లా కార్యాలయానికి బందరులో స్థలం కేటాయించడాన్ని తప్పుపడుతూ డ్రామాలాడటం సిగ్గుచేటని బందరు ఎంఎల్ఎ, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) విమర్శించారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర వివాదాన్ని రాజేస్తూ పోలీసులను తిట్టికొట్టి కేసులు కట్టించుకుని సానుభూతి కోసం డ్రామాలాడుతున్నారని విమర్శించారు. మంగళవారం మచిలీపట్నం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బందరులో ఆంధ్ర బ్యాంక్‌కు ఇచ్చిన స్థలం, పార్టీ కార్యాలయానికి, ఇండోర్ స్టేడియానికి కేటాయించిన స్థలాలు వేరువేరన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో స్థలాలను లీజు తీసుకుందని గుర్తుచేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో విజయవాడ ఆటోనగర్ ఎటిఎ కార్యాలయం సమీపంలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో 95 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని ఏడాదికి వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్లపాటు లీజుకు తీసుకుని టిడిపి కార్యాలయాన్ని నిర్మించారని గుర్తుచేశారు. బందరులోని బాలభవన్ స్థలాన్ని టిడిపి కార్యాలయానికి కేటాయించాలని కోరుతూ అప్పట్లో మంత్రిగా ఉన్న కొల్లు రవీంద్ర కలెక్టర్‌కు రాసిన లేఖను ఈ సందర్భంగా బహిర్గతం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యాలయం కోసం మంగళగిరిలో 3.65 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని, ఎన్టీఆర్ భవనానికి హైదరాబాద్‌లో స్థలాన్ని 99 ఏళ్ల లీజుకు టిడిపి తీసుకుందన్నారు.

In The Court Of The Commissioner For Workmen's Compensation Act and Asst. Commissioner of Labour, Kakinada, Kakinada Dist., A.P.
E.C.No. 6/2022
Between:
గాడిపర్తి పూర్ణ కుమారి అండ్ అదర్స్
...అప్లికెంట్స్ /పిటీషనర్లు
అండ్
గొరిపేని కృష్ణమోహన్ అండ్ అనదర్స్
...ఆపోజిట్ పార్టీ /రెస్పాండెంట్లు
ఆపోజిట్ పార్టీ-1:
గొరిపేని కృష్ణమోహన్, తండ్రి: సీతారామయ్య, వయస్సు 45 సం॥లు, డో.నెం. 6-1122/1, విజ్ఞాన నగర్, జగ్గయ్యపేట, జగ్గయ్యపేట మండలం, కృష్ణ జిల్లా, ఆంధ్రప్రదేశ్. (లారీ యజమాని రిజిస్ట్రర్ నెం. AP 16 TY 4415)
పై నెంబరు కేసులో 1వ ఆపోజిట్ పార్టీ ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున 1వ ఆపోజిట్ పార్టీ హాజరు నిమిత్తం ది.17-02-2023వ తేదీ వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
K.V.BHADRA RAO, K.SRIVANI, K.S.CHANDRA RAO,
Advocates, Kakinada.
Cell: 94401 77063

మొదటి పేజీ తరువాయి

రేపటి నుండి గుణదల మేరీమాత ఉత్సవాలు

ఎడ్యుకేషన్ డెస్క్ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, విచారణ గురువులు ఫాదర్ పసల థోమస్ తదితరులు పాల్గొన్నారు.

1500 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు : సిపి

ఈనెల 9వ తేదీ నుండి గుణదల మేరీ మాత ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు, సిబ్బంది, ఉత్సవాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కాంతి రాణా టాటా మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ వరకు జరిగే గుణదల మేరీ మాత ఉత్సవాల సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ జరుగకుండా ఒక ఐపిఎస్ అధికారి పర్యవేక్షణలో 1500 పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ముఖ్య ప్రదేశాల్లో సిసి కెమెరాలను, మూవింగ్ పార్టీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గుణదల మేరిమాత ఆలయానికి వచ్చే అన్ని రహదారుల్లో పర్యటించి పార్కింగ్, ట్రాఫిక్‌పై ట్రాఫిక్ డిసిపి కె. శ్రీనివాసరావుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఎసిపి ఖాదర్ బాషా, మాచవరం సిఐ గుణరామ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై 'విఎంసి' కసరత్తు

సూచించినట్లు సమాచారం. మురికినీటి కాలువల ప్రాజెక్టులు పూర్తి చేయడం, భూగర్భ డ్రైనేజీ పనులు, పాత తాగునీటి లైన్ల పునరుద్ధరణకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యతను కల్పిస్తూ పెద్ద మొత్తాల్లో నిధుల కేటాయింపులు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో మెరుగైన ర్యాంకింగ్‌ను పొందేందుకు అవసరమైన కంపోస్టింగ్, ఇంటింటికీ చెత్త సేకరణతో సహా పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి నిధులు కేటాయించడంపై దృష్టి సారించారు. వీటితో పాటుగా నగరంలో ప్రధాన రహదారైన ఎంజి రోడ్డుతో పాటు ఎయిర్‌పోర్ట్ కారిడార్‌లో అర్బన్ గ్రీనరీ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. నగరం అభివృద్ధి, సుందరీకరణ లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన చేస్తున్నారు.

ఉద్యమంగా ఈ వేస్ట్ సేకరణ

బెరీలియం వంటి మూలకాలు అతి ప్రమాదకరమైనవన్నారు. పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థ పదార్థాలతో కలిపి పారవేయడం వల్ల రసాయన పదార్థాలు భూమి, నీరు, గాలిలో కలిసి కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తుల వంటి అనేక వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1000 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణలో భాగస్వాములైన లయన్స్ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. లయన్ దామర్ల శ్రీ శాంతి మాట్లాడుతూ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 105 లయన్స్ క్లబ్‌ల ద్వారా 30 రోజులపాటు 1000 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. తొలుత ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో బందర్ రోడ్డులో ర్యాలీని నిర్వహించి ఐజిఎంసి స్టేడియంలో వ్యర్థాల సేకరణను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు లయన్ పి.సుభాష్‌బాబు, అంబటి సుధాకర్‌రెడ్డి, కె.విజయ్‌చంద్, గద్దె శేషగిరి, మిరియాల వెంకటేశ్వరరావు, మూల్పూరి ఉపేంద్ర, యం.ప్రభాకర్‌రావు, కె.సంజీవరావు పాల్గొన్నారు.

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ విజయవాడ 7వ అదనపు జిల్లా జడ్జి మరియు మోటర్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబునల్ కోర్టులో
M.V.O.P No: 76/2022
బిట్వీన్ :-
దైవాల వెంకట రామ హనుమాన్..........పిటీషనర్
మరియు
1. కె.శివనాగరాజు అండ్ 3 అదర్స్ ... రెస్పాండెంట్స్
టు,
1రెస్పాండెంట్ :- కె.శివనాగరాజు, తండ్రి: వెంకటేశ్వరరావు,హిందు, వయస్సు 48 నివాసం: డోర్ నెం:8-13, బి.సి కాలనీ,కాటూరు,వుయ్యూరు, వుయ్యూరు మండలం,కృష్ణా జిల్లా.
పై నెంబరు గల పిటీషన్ లో 1వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం ది.23-02-2023 న కు వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదా తేదిన 1వ రెస్పాండెంట్అయిన మీకు ఏమైన అభ్యంతరములు ఉన్న యెడల మీరు గాని, మీ తరుపు వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట ది. 23-02-2023 వతేదిన ఉదయం గం॥ 10.30ని॥లకు హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల శ్రీ కోర్టువారు తదుపరి ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయడ మైనది.
(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 23-02-2023
ఇట్లు:- నర్రా నాగేశ్వరరావు
న్యాయవాది, విజయవాడ-10

సమన్వయంతో పనిచేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తిరిగి మళ్లీ గెలిపించుకోవడానికి నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం అవనిగడ్డ వైసిపి

మాట్లాడుతున్న సింహాద్రి రమేష్‌బాబు

కార్యాలయంలో మండల స్థాయి గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహ సారధులకు ఏర్పాటుచేసిన శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్ళుగా భావించి అమలు చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. రాష్ట్రంలో తిరిగి వైసిపి అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా అమలవుతాయన్నారు. పేద, బడుగు బలహీన వర్గాలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. ప్రతి గృహ సారధి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించాలన్నారు. వారిని కన్వీనర్లు సమన్వయంతో నడిపించాలని సూచించారు. నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత, వైసిపి వల్లే సాధ్యమవుతుందన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి మహిళల కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలు వారి అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తున్నాయన్నారు. సచివాలయాల మండల కన్వీనర్ షేక్ నజీర్ భాష అధ్యక్షత వహించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్ బాబు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా, వైసిపి నియోజకవర్గ నాయకుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, రామకోటిపురం, సర్పంచ్ ముడిమి లక్ష్మీతిరుపతమ్మ, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఎంపిటిసి సభ్యులు గోళ్ల విజయలక్ష్మి, వర్రే నరేష్‌బాబు, తోట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా చర్యలు : కైలే

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

జగనన్న పాలనలో గడపగడపకూ అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా

వాహనాన్ని ప్రారంభిస్తున్న కైలే అనిల్‌కుమార్

సుఖసంతోషాలతో ఉన్నారని పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. బొడ్డపాడు గ్రామంలో మంగళవారం 'గడపగడపకు -మన ప్రభుత్వం కార్యక్రమం'లో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ ఫలాలు అందుతున్న రీతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించే నిమిత్తం సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అనంతరం డాక్టర్ వై.య.స్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వ్యాన్ ను ప్రారంభించారు. ఈ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సర్పంచ్ మూడే శివశంకర్, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్ళం వెంకటేశ్వర రెడ్డి తాసిల్దార్ కట్ట వెంకట శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చల్లపల్లి

నిరుపేద కుటుంబాల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చల్లపల్లి మండలం యార్లగడ్డలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూడలేక ప్రతిపక్ష నాయకులు జగన్మోహన్‌రెడ్డి పై బురద చల్లుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ సర్పంచ్ యార్లగడ్డ హేమంజనేయ ప్రసాద్, పురిటిగడ్డ సర్పంచ్ మాతంగి రమ్య, ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, కర్రా రవి, పీఏసీఎస్ చైర్మన్ సత్యాంజనేయ ప్రసాద్, వివిధ శాఖల ప్రభుత్వాధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైసిపి పాలన అవినీతిమయం : వర్ల

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలన పూర్తిగా అవినీతిమయమని టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల

కుమార్ రాజా విమర్శించారు. మాజీ శాసనసభ్యులు, గుడివాడ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రావి వెంకటేశ్వరరావును అక్రమంగా అరెస్ట్‌చేసి పమిడిముక్కల పోలీస్‌స్టేషన్‌ను తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వర్ల కుమార్‌రాజా అక్కడికి వచ్చి టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. రావి వెంకటేశ్వరరావు అక్రమ అరెస్టు దారుణమని కరండించారు. అనంతరం చోరగుడి గ్రామంలో జరిగిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కందిమల్ల సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరెడ్డి, శివయ్య, లక్ష్మీనారాయణ, మైనేని ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

దాసరి విజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ మండలంలోని పులిగడ్డ సర్పంచ్ దాసరి

కేకు తినిపిస్తున్న వైసిపి నాయకులు

విజయకుమార్ పుట్టినరోజు వేడుకలు మంగళవారంనాడు ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ వైసిపి కార్యాలయం వద్ద విజయ్‌కుమార్ చేత ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, యువ నాయకులు సింహాద్రి వికాస్‌బాబు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా, పార్టీ నియోజకవర్గ నాయకుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ షేక్ నజీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎంపై కేసు నమోదు

ప్రజాశక్తి -మొవ్వ

మండల మహిళా సమాఖ్యలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న జె.సునీత పట్ల అదే కార్యాలయంలో పనిచేసే ఎపిఎం కె.సుబ్బారావు లైంగిక వేధింపులకు పాల్పడిన ఉదంతంపై కూచిపూడి పోలీస్ స్టేషనులో కేసు నమోదైంది. మండల మహిళా సమాఖ్య పరిధిలో పనిచేసే మహిళా సిబ్బంది, ప్రజాసంఘాల నేతలు వెంటరాగా బాధితురాలు జె.సునీత మంగళవారం ఎపిఎం సుబ్బారావుపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కూచిపూడి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు ఆందోళన వ్యక్తం చేశారు. నిందితుడు ఏపిఎం సుబ్బారావుపై రెండోసారి ఈ విధమైన ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించడంతో పాటు బాదితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు సంబంధించిన కార్యాలయాల్లో మహిళా అధికారులనే నియమిస్తే ఈ రకమైన ఘటనలకు ఆస్కారం ఉండబోదన్నారు. బాధిత మహిళకు న్యాయం చేయాలని, కీచక ఏపిఎం సుబ్బారావును కఠినంగా శిక్షించాలని కొద్దిసేపు నినాదాలు చేశారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు,సిఐటియు జిల్లా నాయకులు ఒడుగు గంగాధరరావు, మండల కార్యదర్శి కాకి రాజశేఖర్, విఒల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్ని లతో పాటు పలువురు వెలుగు బుక్ కీపర్లు,సిసిలు బాధితురాలు సునీతకు సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన

మొవ్వలో రెండో విడత రీసర్వే ప్రారంభం

ప్రజాశక్తి - మొవ్వ

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకంలో భాగంగా మీభూమి - మా హామీ కార్యక్రమంలో భాగంగా భూముల రీసర్వే మొవ్వ మండలంలో రెండో విడత కొనసాగుతోంది. మండల

పరిధిలోని కోసూరు గ్రామంలో మంగళవారం డ్రోన్ సర్వేకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ ఎ.కిషోర్ బాబు మాట్లాడుతూ రెండో విడత కోసూరు,కాజ, నిడుమోలు,పాలంకిపాడు గ్రామాల్లో డ్రోన్ ప్రక్రియలో సర్వే పనులు ప్రారంభించినట్లు చెప్పారు. డ్రోన్ సర్వే అనంతరం ఆర్థోరెక్టిపై ఇమేజ్ (ఓఆర్ఐ) ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతుల సమక్షంలో గ్రౌండ్ ట్రూతింగ్ చేస్తామన్నారు. గ్రౌండ్ వ్యాల్యుడేషన్ పక్రియ పూర్తయిన అనంతరం రైతులు ఫారం 92 ఫార్మాట్ లో అంగీకారం తెలపాల్సిఉందన్నారు. బార్లపూడి, పెదసనగల్లు, చినముత్తేవి, అవిరిపూడి,పెదముత్తేవి, అయ్యంకి గ్రామాల్లో మొదటి విడతలో సర్వే పూర్తిచేసినట్లు మండల సర్వేయర్ కిషోర్ బాబు వివరించారు. రీసర్వే డిటి కొడాలి శ్రీనివాసరావు,విఆర్ఓ,విలేజ్ సర్వేయర్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలో గాయత్రికి పతకం

ప్రజాశక్తి-నాగాయలక

5వ ఖేల్ ఇండియా యువత జాతీయ స్థాయి క్రీడా పోటీలు 30 జనవరి 2023 నుంచి ఈనెల 11 వరకు మధ్యప్రదేశ్‌లోని సహస్త్రంధర మహేశ్వరంలోని నర్మదానదిలో జరుగుతున్నాయి. 7న జూనియర్ విభాగంలో మంగళవారం నిర్వహించిన కే బి1 స్లాలొమ్ ఉమెన్స్ విభాగంలో కానోయింగ్,కాయాకింగ్ జాతీయ స్థాయి క్రీడల పోటీల్లో ఎనిమిది రాష్ట్రాలు క్రీడాకారులు పాల్గొన్నాయి. రాష్ట్రం తరపున కష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రికి ద్వితీయ స్థానంలో గెలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అగ్ని కుల క్షత్రియుల సంక్షేమం సంఘం అధికార ప్రతినిధి లకనం నాగాంజనేయులు ఆమెకు అభినందనలు తెలిపారు. పేద బిసి అగ్ని కుల క్షత్రియుల సామాజిక తరగతికి చెందిన గాయత్రికి మెరుగైన శిక్షణ కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు గోగినేనిపాలెం విద్యార్థి

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండల పరిధిలోని గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థి గరికముక్కు హర్షవర్ధన్ అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.ప్రభాకర్ తెలిపారు. ఏలూరు జిల్లా పెదవేగిలో ఫిబ్రవరి ఈనెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకూ నిర్వహించిన అండర్-14 బాలబాలికల రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడల్లో తమ విద్యార్థులు గరికముక్కు హర్షవర్ధన్, యార్లగడ్డ రాజేష్, కట్టా జగదీష్, మురాల లీలా శ్రీవల్లి, పడమట దుర్గా తేజ శ్రీ, కొడాలి తేజస్వి కష్ణాజిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కృష్ణాజిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించిందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ జట్టుకు ఎంపిక కాగా, అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన హర్షవర్ధన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి హర్షవర్ధన్, తండ్రి నాగేశ్వరరావుతోపాటు పిడి మారుతిలను ఉపాధ్యాయ బృందం దుశ్శాలువాతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి : జడ్‌పిటిసి

పమిడిముక్కల : విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారని పమిడిముక్కల జెడ్పీటీసీ సభ్యురాలు, విద్య, వైద్యరంగం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు యేనుగు వెంకటరమణ కుమారి అన్నారు. పమిడిముక్కల మండలంలోని మంటాడ రెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంబపు రాంబాబు, కన్వీనర్ గార రమాదేవి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎస్తేరు రాణి, గ్రామ [illegible] పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వకుంటే ఉద్యమం : సిపిఎం

ప్రజాశక్తి-సింగ్‌నగర్: అజిత్ సింగ్ నగర్‌లోని నందమూరి నగర్‌లో సిపిఎం నేతలు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ వైసిపి కార్యాలయాలకు ప్రభుత్వ భూములను కట్టబెట్టడం తగదన్నారు. అసైన్డ్, వివాదాస్పద భూములపై పేదలకు హక్కులు కల్పిస్తామని చెప్పి నేతలే కబ్జా చేస్తున్నారని విమర్శించారు. పేదలకు పట్టాలు ఇవ్వకుండా రెగ్యులర్ చేస్తామని ఒటిఎస్ పథకం పేరు చెప్పి కోట్లు వసూలు చేశారన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ఉన్న నందమూరి నగర్ వాసులకు కూడా పట్టాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. అధికార పార్టీ నేతలు వీధులు పేర్లు పేరుతో వివిధ కాలనీ వాసుల మధ్య చిచ్చు బెడుతూ పట్టాల సమస్యను పక్క దారి పట్టిస్తున్నారన్నారు. ఇప్పటికైనా పట్టాలు ఇవ్వకపోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. చెత్త పన్ను, విద్యుత్ ఛార్జీలు, ధరల భారాలు, పెన్షన్ల మంజూరు, టిడ్కో ఇళ్లు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రమణారావు, దుర్గారావు, సిహెచ్.శ్రీనివాస్, పీరు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ రూరల్ ట్రైనీ తహశీల్దార్‌గా జాహ్నవి

ప్రజాశక్తి-విజయవాడ రూరల్

విజయవాడ రూరల్ మండల ట్రైనీ తహశీల్దార్‌గా పి.జాహ్నవి నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె రెండేళ్ల పాటు విజయవాడ రూరల్ మండల ట్రైనీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఆమె చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు తహశీల్దార్‌గా పని చేసిన బి.సాయిశ్రీనివాస్‌నాయక్ ఉద్యోగోన్నతిపై సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ పొందారు. దీంతో ప్రభుత్వం జాహ్నవిని ట్రైనీ తహశీల్దార్‌గా నియమించింది. 8న జాహ్నవి బాధ్యతలు స్వీకరించనున్నారు.

'రిసోనెన్స్'కు ర్యాంకులు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: జెఇఇ మెయిన్స్-2023 ప్రవేశ పరీక్షా ఫలితాలలో నగరంలోని రిసోనెన్స్ విద్యార్థులు అత్యధిక శాతం మార్కులు సాధించారని సంస్థ డైరెక్టర్ బండ్ల మాధవరావు తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ర్యాంకులు సాధించిన విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఐఐటి, నీట్‌లో శిక్షణ ఇచ్చే సంస్థల్లో దేశంలోనే రిసోనెన్స్ నెంబర్‌వన్ స్థానంలో ఉందని తెలిపారు. జెఇఇ మెయిన్స్ ఫలితాలలో తమ విద్యార్థులు 99 శాతం పర్సంటైల్ సాధించారన్నారు. 90కిపైగా పర్సంటైల్ 24 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. అలాగే ప్రతిష్టాత్మకమైన ఎన్ఐటి సంస్థలలో తమ విద్యార్థులు సీట్లు సాధించారని తెలిపారు. తమ సంస్థ నుండి 160 మంది విద్యార్థులకు 42 మంది నీట్‌లో మంచి సీటు సాధించారని తెలిపారు. విద్యార్థులను రిసోనెన్స్ విజయవాడ శాఖ డీన్ వి.ఎస్.రావు, కోసూరి రవికుమార్ అభినందించారు.

ఏప్రిల్ 8 నుండి ప్రవేశ పరీక్షలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ, పిజి కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి పరీక్ష తేదీలను ప్రకటించినట్లు శివ నాడార్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీమన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 8వ తేదీ నుండి జూన్ 17వ తేదీ వరకు దశల వారీగా పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విజయవాడతో పాటు హైదరాబాదులో ఎంపిక చేసిన వివిధ ప్రాంతాలలో జరుగనున్నాయన్నారు. ఈ ఏడాది ఇంజనీరింగ్, కామర్స్, హ్యూమానిటీస్, గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తున్నామని తెలిపారు.

నూతన జెకె టైర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: పర్యావరణ అనుకూలంగా క్లీన్ మొబిలిటీలో భాగంగా జెకె టైర్ ఎక్స్ట్రా ఫ్యూయల్ ఎఫిషియంట్ టైర్లను తీసుకువచ్చినట్లు సంస్థ ప్రతినిధి రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జెకె టైర్ అండ్ ఇండస్ట్రీస్ అత్యున్నత ఇంధన సామర్థ్యం కలిగిన టైర్లను మీడియం, కమర్షియల్ వాహనాలు అందిస్తున్నామని తెలిపారు. నూతనంగా విడుదల చేసిన ఎట్వే టైర్లు మన్నిక కలవని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

'శ్రీ శ్రీనివాస గ్రావిటీ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: జెఇఇ మెయిన్స్-2023 ఫలితాల్లో మొగల్‌రాజపురంలోని శ్రీ శ్రీనివాస గ్రావిటీ విద్యా సంస్థల విద్యార్థులు వంద శాతం పర్సంటైల్ సాధించారని శ్రీ శ్రీనివాస గ్రావిటీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. మొగల్‌రాజపురంలోని కళాశాల ప్రాంగణంలో బుధవారం ప్రతిభ కనపరచిన విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద శాతం పర్సంటైల్ సాధించి నగరంలోనే మొదటి సంస్థగా పేరుగాంచినట్లు తెలిపారు. తమ విద్యార్థి సోమిశెట్టి రాహుల్ కౌశిక్ కెమిస్ట్రీలో వంద పర్సంటైల్ సాధించి, ఓవరాల్‌గా 99.99 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. మరో విద్యార్థి బి.లిఖిత్ 99.5 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. అలాగే మరో 11 మంది విద్యార్థులు 97 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు ప్రతి ఏటా జెఇఇ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించి ప్రతిభ కనపరుస్తున్నారని తెలిపారు. గత నాలుగేళ్లుగా ప్రతిష్టాత్మకమైన ఫలితాలను సాధిస్తు న్నామని, అతి తక్కువ మంది విద్యార్థులతో జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.ఫణిరాజ్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

జెఇఇ మెయిన్స్‌లో 'శారద' ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: జెఇఇ - మెయిన్స్ 2023 ప్రవేశ పరీక్షా ఫలితాలలో నగరంలోని శారద విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్‌భాబు తెలిపారు. మొల్‌రాజపురంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎం.తేజో రామ విఘ్నేశ్వర్ 99.32 శాతం, సిహెచ్.హేమంత్ 99.01, సయ్యద్ నవీద్ మహమ్మద్ 99.01, యం.గణేష్ పవన్ గోకుల్ 98.6, జి.షణ్ముఖరెడ్డి 98.5, శ్రీకాంత్ సాయి గంగ 98.5, ఎం.డి.అర్షద్ అలీ 98 శాతం సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లో అద్భుత ఫలితాలు సాధించారన్నారు. తమ కళాశాల కేవలం డే స్కాలర్స్ విద్యార్థులతోనే ఉత్తమ ఫలితాలను సాధించామని తెలిపారు. తమ సంస్థ నుండి 650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, సుమారు 350 మందికిపైగా విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌ను సాధించారన్నారు. విద్యార్థులను విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, కళాశాల జనరల్ మేనేజర్ జి.వి.రావు అభినందించారు.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి : వెలంపల్లి

ప్రజాశక్తి-వన్‌టౌన్: నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక 34వ డివిజన్‌లోని 225వ సచివాలయం పరిధిలో 185వ రోజు మంగళవారం గడపగడపకు మన ప్రభ్యుత్వం కార్యక్రమం జరిగింది. ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి గడపగడపకు వెళ్లి ప్రజలకు ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వ పరంగా జరిగిన సంక్షేమ పథకాల వివరాలు తెలియచేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఎర్రకట్ట రోడ్ అభివద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 34వ డివిజన్ కార్పొరేటర్, ఏపి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 34వ డివిజన్ కేదారేశ్వరపేట ప్రభాస్ కాలేజ్ ప్రాంతంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన బిటి రోడ్డును ఎమ్మెల్యే వెలంపల్లి ప్రారంభించారు.

రోడ్డు ప్రారంభం సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

కరుణించు... దయచూపే... గుణదలమాత
గుణదలమాత తిరునాళ్ళకు విచ్చేయుచున్న అశేషభక్తకోటికి స్వాగతం ! సుస్వాగతం !!
రండి... రక్షణ పొందండి...
గుణదలమాత దీవెనలు పొందండి...
గుణదలమాత మహోత్సవాలు
2023 ఫిబ్రవరి 9, 10, 11 తేదీలలో
దేవుని కృపావరప్రసాదాలకు పవిత్రవేదిక గుణదలమాత పుణ్యక్షేత్రం.
మహాసాధ్వీమణి, కన్య మరియు మానవ రక్షణకై మహోన్నత కుమారుని కని, పెంచి
మనకందించిన మాతృమూర్తి. ఈ సమస్త మానవాళికి చల్లని దీవెనలు,
ఆయురారోగ్య, మహాభాగ్యములు ప్రసాదిస్తున్న గుణదలమాత నీకే వందనం !!!

విజయవాడ కతోలిక పీఠం, కృష్ణాజిల్లా, గుణదలమాత పుణ్యక్షేత్రం ఉత్సవ కమిటి

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.